క్లుప్తంగా

బాధ్యతాయుతంగా సేవలందించాలి

చిట్వేలి : బాధ్యతాయుతమైన సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందాలని గ్రామ పెద్దలు లారీ సుబ్బరాయుడు, బాలు, రామాంజుల నాయుడు సూచించారు. బదిలీపై వెళ్తున్న సి.కందులవారిపల్లి సచివాలయ ఉద్యోగులు అరవింద్, సుబ్బమ్మ, నిర్మల, సుభద్రమ్మ, హేమలక్ష్మీలను వారు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన చోట మంచిపేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ నాయుడు, వెంకటేష్ రాజు, సుబ్రహ్మణ్యం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలంటూ 9న సమ్మె

లక్కిరెడ్డిపల్లి : లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఈ నెల 9న జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి అన్నారు. స్థానిక బాలసదన్‌లో అంగన్ వాడీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కనీస వేతన చట్టం అమలు చేయాలని, కార్మికులు పోరాటాలతో సాధించిన చట్టాలను తొలగించడం తగదన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని, దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, ఓబులమ్మ, శారద, రుక్మీ, మణి, శైలజ, మల్లిక, ఆయేషా, రత్నమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మండల అధ్యక్షుడు మృతి

రాయచోటి : రాయచోటి మాజీ మండలాధ్యక్షులు మడితాటి రాజారెడ్డి (80) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాయన ఇంటిలోనే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. 1995వ సంవత్సరం నుంచి 1998వ సంవత్సరం వరకూ రాయచోటి మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడిగా రాజారెడ్డి పని చేశారు. తాను పనిచేసిన కాలంతోపాటు మిగిలిన రోజులలో రాయచోటి పట్టణం, మండల అభివృద్ధికి కృషి చేశారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీలో కీలక నేతగా తనదైన పాత్ర పోషించారు. మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్ కుమార్ రెడ్డి, టిడిపి మాజీ బోర్డు సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, మంత్రి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ముగిసిన శిక్షణ

రాజంపేట : పట్టణంలోని అన్నమాచార్య యూనవర్సిటీలో ఎఫ్‌డీపీ(ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) శిక్షణ ముగిసింది. శనివారం ఈఈఈ, ఈసీఈ విభాగాలు సంయుక్తంగా పైథాన్ ప్రోగ్రామింగ్ నిర్వహించాయి. ఐటీ కన్సల్టెంట్ భానుపావన్ సాయి(హైదరాబాదు) సాంకేతిక నైపుణ్యాలను వివరించారు. ప్రిన్సిపల్ నారాయణ మాట్లాడుతూ పీడీపీ శిక్షణ పరిశోధనాత్మక దృష్టిని కలిగిస్తుందని, విద్యార్థులకు బలమైన పునాది ఏర్పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పద్మలలిత, డా.నాగరాజు, చెన్నయ్య, చిన్నబాబు, శారద, వెంకటేశ్, డా.సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

రూ.60 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ఓబులవారిపల్లె : మండలంలోని బోటుమీదపల్లి నుంచి కాకర్లవారిపల్లి వరకూ రూ.60 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. రహదారి నిర్మాణానికి శనివారం వారు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కాసాయి వికాష్‌రెడ్డి, గునిపాటి చెన్నరాయుడు, కె.చలపతి, బత్తినవేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సిద్దవటం : గ్రామాలను పరిశుభ్రంగా పెట్టుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. భాకరాపేట గ్రామంలో ఎంపీడీఓ ఫణిరాజకుమారి స్థానిక ప్రజలతో మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు. చిరు దుకాణాల వ్యాపారులు ప్లాస్టిక్ పదార్థాలను డస్టు బిన్‌లో వేసి హరిత రాయబారుల వాహనంలో వేయాలని సూచించారు. మిట్టపల్లి, పేరయ్యగారిపల్లె, శివునిపల్లె గ్రామాలతో పాటు భాకరాపేటలోనూ బ్లీచింగ్ పిచికారీ చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంధ్య, హరిత రాయబారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీయకండి

పుల్లంపేట : మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు సాక్షులుగా ఇతర డిపార్టుమెంట్ అధికారులను నియమించుకోవాలని ఉత్తర్వులివ్వడం ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయు) మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, వల్లూరు సిద్దయ్యలు అన్నారు. విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 10న జరిగే పేరెంట్స్ మీటింగ్‌కు ఇతర డిపార్టుమెంట్ అధికారులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులలో పాఠశాలలపై నమ్మకం పోయేలా ఉందన్నారు.

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ..

- అంతర పంటల సాగుతో అధిక ఆదాయం
- మిరప, కంది పంటల్లో కూరగాయల సాగు
- ప్రధాన పంటపై తగ్గనున్న చీడపీడల బెడద



రామాపురం మండలంలో రైతు సాగు చేసిన అంతర పంటలు

రాయచోటి జగదాంబసెంటర్ : మారుతున్న కాలంతో పాటు సాగులోనూ రైతులు ఆధునిక విధానం పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని, సాగులో ఉన్న పైరులోనే అంతర పంటలు సాగు చేస్తే అధిక ఆదాయాన్ని పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. రాయచోటి మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు ప్రధాన పంటల్లో అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఈ ఏడాది పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

కంది, మిరప పంటలు

రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా కంది, మిరప పంటలు సాగు చేస్తారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ముగిసే సమయంలో అంతర పంటలుగా కూరగాయల సాగు ఒక రకమైతే, సాగు ఆలస్యమైన సమయంలోనూ అంతర పంటలు సాగు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. పంట చేతికొచ్చేవరకు అంతర పంటలు పెరుగుతూ ఆదాయాన్ని అందిస్తూ ఉంటాయి. అంతర పంటలకు ప్రత్యేకంగా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయాల్సిన పనిలేదు. కలుపుతీయడం, అంతర సేద్యం చేయాల్సిన అవసరం ఉండదు. అసలు పంట ఆదాయం ఖర్చులకు పోతే, అంతర పంటల ద్వారా వచ్చే ఆదాయం మిగులుతుంది. తద్వారా రైతులు అధిక ఆదాయం గడించవచ్చు.

తీగజాతి కూరగాయల సాగు

ఖరీఫ్ ముగిసే సమయంలో రైతులు అంతర పంటగా చిక్కుడు, కాకర వంటి తీగజాతి కూరగాయలను పండించే అవకాశం ఉన్నా రైతులు ఎక్కువగా చిక్కుడు మాత్రమే సాగు చేస్తుంటారు. ఇలాంటి చెట్లలో మొదళ్ల వద్ద తీగజాతికి చెందిన కూరగాయల విత్తనాలు నాటితే పెద్దగా పెరుగుతూ చెట్లను అల్లుకుంటాయి. తీగలు నేలను తాకవు. దీంతో కూరగాయల మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుంది.

పెట్టుబడి తక్కువే

మిరప, కంది పంటల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేసే రైతులకు పెట్టుబడి తక్కువగా ఉంటుంది. కేవలం విత్తనాలు కొనుగోలు చేసి పొలంలోని సాళ్లలో విత్తుకోవాలి. సాగులో ఉన్న పైర్లకు వేస్తున్న ఎరువులు, పురుగుమందులు, అంతర పంటలపై పడటంతో తెగుళ్లు ఆశించవు. తద్వారా ఎలాంటి పెట్టుబడి లేకుండానే కూరగాయల మొక్కలు పెరిగి పంట చేతికందుతుంది. కూరగాయలు వచ్చిన తర్వాతనే ప్రత్యేకంగా రెండు, మూడు పర్యాయాలు పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం వలన ఖర్చులు తగ్గుతాయని చెబుతున్నారు. కూరగాయలు అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది.

అంతర పంటలతో లాభదాయకం



మిరప, కంది పంటల్లో చిక్కుడు, అనప పంటలు సాగు చేసుకోవచ్చు. అంతర పంటలుగా ఐదు రకాలు సాగు చేస్తే ఒక సాగులో ఐదు రకాల ఆదాయం పొందే వీలుంటుంది. కేవలం విత్తనం ఖర్చుతోనే పంట చేతికి తీసుకోవచ్చు. ప్రత్యేకంగా నీటి అవసరం, మందుల అవసరం ఉండదు. ఈ విధానం వలన పొలంలో తేమ శాతం కాపాడుకోవచ్చు. భూసారం పెరుగుతుంది. కలుపు బెడద, చీడపీడల బెడద తగ్గించుకోవచ్చు.

– నాగమణి, వ్యవసాయాధికారిణి, రామాపురం మండలం

వారాహిదేవికి అభిషేకం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న వారాహిదేవి

రాజంపేట రూరల్ : పట్టణ శివారులోని మణికంఠనగర్ అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం వారాహిదేవికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తపల్లి రాఘవేంద్రస్వామి, కొండా సత్యనారాయణస్వామి వారాహి దేవికి ఉదయం గణపతిపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 జ్యోతులతో ప్రత్యేక దీపార్చన, గణపతి, నవగ్రహాల హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట పాలప్రకాష్, ధర్మకర్తలు కె.దాముఆచారి, పి.వేంకటసుబ్బయ్య, కే.రమేష్, ఏ.చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

చీటింగ్ మ్యానిఫెస్టోతో చంద్రబాబు పాలనకు చరమగీతం



సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు



రీకాలింగ్ మ్యానిఫెస్టో బార్ కోడ్ విడుదల చేస్తున్న ఆకేపాటి, సురేష్‌బాబు

- బాబు పాలనపై జనం అసంతృప్తి
- జగన్‌కు పెరుగుతన్న జనాదరణ
- తట్టుకోలేకపోతున్న కూటమి ప్రభుత్వం
- రాజంపేట సభలో సురేష్‌బాబు, ఆకేపాటి

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజలను చీటింగ్ చేసేలా మ్యానిఫెస్టో తీసుకొచ్చి.. ఇపుడు అమలు చేయకపోవడంతో చంద్రబాబు పాలనకు చరమగీతం పాడే దిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా పరిశీలకుడు, కడప మేయర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఆర్ఎస్‌రోడ్డులోని జీఎంఎస్ కళ్యాణమండపంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఏడాదికే చంద్రబాబు పాలనపై విసిగెత్తి పోయారని, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనాదరణ చూసి కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. అక్రమ కేసులు పెట్టి అత్యంత జనారదరణ కలిగిన నేత జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకోవాలని సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు చాలా ఉన్నాయన్నారు. ఏడాదికే కూటమి ప్రభుత్వం అపహాస్యంపాలైందని, తీవ్ర ప్రజావ్యతిరేకత మూటకట్టుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామస్వామిరెడ్డి, శివారెడ్డి, దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, కృష్ణారావు యాదవ్, వడ్డెరమణ, టక్కోలు శివారెడ్డి, గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, గాలివీటి వివేకానందరెడ్డి, వరదరాజు(బాబు), ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, గడికోట సుబ్బారెడ్డి, ఇస్మాయిల్, వీరనాగిరెడ్డి, వడ్డెరమణ, అబ్దుల్లా, నాయబ్ రసూల్, సురేఖ మాట్లాడారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: ఆకేపాటి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన అధ్వానంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ రీకాలింగ్ మేనిఫెస్టో ద్వారా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. ప్రజలందరి సెల్‌లో అప్‌లోడ్ చేసేలా చూడాలన్నారు. రాష్ట్రమంతటా కూటమిగాలి వీస్తే రాజంపేటలో మాత్రం వైఎస్సార్‌సీపీ గాలి వీసిందన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామనిలాయన భరోసా ఇచ్చారు. వందకుపైగా చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు ప్రశ్నార్థకరమే అన్న భావన ప్రజల్లో నాటుకుపోయిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో ఇటీవల పెద్ద ఎత్తున క్యాడర్‌కు పదవులను కట్టబెట్టారని, సమష్టి కృషితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు పాలనను ఎండగట్టే విధంగా క్యాడర్ పనిచేయాలన్నారు.

తరలివచ్చిన అభిమానులు

నియోజకవర్గ సర్వసభ్య సమావేశం కావడంతో రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, వీరబల్లి, సుండుపల్లె, సిద్ధవటం మండలాల నుంచి పార్టీ క్యాడర్ పెద్ద ఎత్తున కదలివచ్చింది. సభలో మాట్లాడిన ప్రతి ఒక్కరూ కూటమి వైఫల్యాలను ఎత్తిచూపారు. జగనన్న పాలన వచ్చేంతవరకు క్యాడర్ కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్ సనిశెట్టి నవీన్, రమేష్ నాయుడు, గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, నాయనపల్లె అనుదీప్, గీతాల నరసింహారెడ్డి, ఎంజీపురం మధు, దండుగోపి, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, అరిగెలసౌమిత్రి, శీతంపేట వెంకట్రాజు, గోవిందుబాలకృష్ణ, జావిద్‌అలీ, మసూద్, జానకిరామయ్య, చేకూరి ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు మాని.. రైతులను ఆదుకోండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



మామిడి కాయలు పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే

రైల్వేకోడూరు అర్బన్ : మాయమాటలు మాని.. కూటమి ప్రభుత్వ నాయకులు మామిడి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. రైల్వేకోడూరు మామిడికాయల యార్డులో శనివారం ఆయన పర్యటించి మామిడి రైతులు, వ్యాపారుల కష్టాలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో వ్యవసాయరంగం అతలాకుతలమైందని, గిట్టుబాటు ధర, ప్రభుత్వ ప్రోత్సాహ లేక రైతులు కుదేలయ్యారని తెలిపారు. మామిడి రైతులు అప్పులపాలయ్యారని, కూలీలకు చెల్లించిన మొత్తం కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. వారిని ఆదుకోవాల్సిన కూటమి నాయకులు మాయబాటలు చెప్పి కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. అప్పులు కట్టలేక కొందరు రైతులు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి రూ.4 ఇప్పిస్తామని చెప్పినా.. ఆ కాయలు ఫ్యాక్టరీలు తీసుకోవడంలేదని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మామిడి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2005లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫ్యాక్టరీలు మామిడి కాయలు తీసుకోవాల్సిందేనని, లేకపోతే ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకొని నడిపిస్తామని ఆదేశాలు జారీచేసినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అలాంటి ఆదేశాలిస్తే రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కర్నాటక కేంద్ర మంత్రి కుమారస్వామి అక్కడి రైతులకు టన్నుకు రూ.16 వేలు ఇప్పించు కోగలిగారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతును ఆదుకోకుంటే జాతీయ రహదారిపై ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యాపారులు, నాయకులు సీహెచ్.రమేష్, మందలనాగేంద్ర, తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.


మామిడి రైతుల పరిస్థితి అధోగతి



మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో మామిడి రైతుల పరిస్థితి అధోగతి పాలైందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడుతూ రాష్ట్రంలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కర్నాటక రాష్ట్రంలో జెడీఎస్ పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి కుమార్‌స్వామి కేంద్రానికి లేఖ రాయడంతో, కిలో రూ.16 చొప్పున 2,50,000ల టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు అలా చేయడంలేదని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కేంద్రం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని, రైతులు నష్టపోయినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జానం రవీంద్ర యాదవ్, సంజీవయ్య, హజరత్ ఖాదర్‌వలి, క్రిష్ నవాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులతో చర్చించకుండానే లేబర్ కోడ్లకు ఆమోదం



సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె : కోవిడ్ సమయంలో పార్లమెంటులోగానీ, కార్మికులతోగానీ చర్చించకుండా బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఆమోదించడం జరిగిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన సమయంలో మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జూలై 9న నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సంఘం పెట్టుకునే హక్కుతో సహా బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి చట్టాలను గతంలో పోరాడి సాధిస్తే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాలను కబళిస్తున్నాయన్నారు. 29 కార్మి చట్టాలను రద్దుచేసి పెట్టుబడిదారుల లాభాల కోసం రద్దు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎండీసీ అవుట్ సోర్సింగ్ పోరాట కమిటీ జనరల్ సెక్రటరీ ఆర్ వెంకటేష్, ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరి ఎం.శ్రీనివాసులు, త్రివేణి యూనియన్ నాయకులు పులగంటి శ్రీను, రమణ, ముత్యాల శ్రీను, ఏపీఎండీసీ అవుట్ సోర్సింగ్ ట్రైనింగ్ కార్మిక పోరాట కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.దేవకుమార్‌రెడ్డి, మామిళ్ల శేఖర్, కో–కన్వీనర్ ఎ.అరుణ, ఎంజె.ధనలక్ష్మీ, శ్రీను, సందీప్ పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



రాయచోటిజగదాంబసెంటర్ : పట్టణంలోని లక్ష్మీపురంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూల విరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పాల్గొనగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు మారెమ్మ దేవత ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న మారెమ్మ

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని వంకగడ్డ రాచపల్లి సమీపంలో వెలసిన మారెమ్మ దేవత ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కుర్నూతల అగ్రహారానికి చెందిన వెంకటనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం హోమం, ఊంజల్ సేవ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండలం లోని భక్తులు, మహిళలు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

• ఆంజనేయుడికి పూజలు

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని కొత్తపే గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసిన ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామికి ఆకుపూజ, సింధూర పూజ జరిపారు. భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

• 10న గురుపౌర్ణమి వేడుకలు

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 10న గురు పౌర్ణమి వేడుకలు జరుగునని నిర్వాహకులు ఆవులరెడ్డి తెలిపారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ 10న స్వామికి అభిషేకం, అలంకరణ, కాగడాల హారతి, సుప్రభాతం, పంచామృతాభిషేకం, నవగ్రహపూజా హోమం, తీర్థ ప్రసాదాల వినియోగం ఉంటాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, సంధ్యా హారతి, పల్లకీ సేవ, సేజ్ హారతి పూజలు జరుగుతాయన్నారు. రాత్రి ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలుయుంటాయని భక్తులు స్వామిని దర్శించుకోవచ్చునని ఆయన తెలిపారు.

రాజంపేట రూరల్ : పట్టణ శివారులోని మణికంఠనగర్ అయ్యప్పస్వామి దేవస్థానంలో శనివారం వారాహిదేవికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తపల్లి రాఘవేంద్రస్వామి, కొండా సత్యనారాయణస్వామి వారాహి దేవికి ఉదయం గణపతిపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 జ్యోతులతో ప్రత్యేక దీపార్చన, గణపతి, నవగ్రహాల హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయకమిటీ అధ్యక్షుడు తుమ్మలపెంట పాలప్రకాష్, ధర్మకర్తలు కె.దాముఆచారి, పి.వేంకటసుబ్బయ్య, కే.రమేష్, ఏ.చిన్నపరెడ్డి పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి ఎంపీ నిధులు

సుండుపల్లె : మండలంలోని పెద్దపల్లి వద్ద కాజ్‌వే మరమ్మతులకు రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు రాయచోటి మాజీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో పింఛా ప్రాజెక్టు కొట్టుకుపోయినప్పుడు కాజ్‌వే దెబ్బతినడంతో మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. రాజ్యసభ సభ్యుడు రఘునాథరెడ్డి నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

పెంపుడు కుక్కలకు నేడు ఉచితంగా టీకాలు

రాజంపేట రూరల్ : ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మన్నూరు ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఆదివారం ఉచిత యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నట్లు రాజంపేట ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



నల్లపురెడ్డిపల్లిలో బండలాగుతున్న ఎద్దు



ఈడిగపల్లిలో పీర్ల ఊరేగింపు

పెనగలూరు : మొహర్రం సందర్భంగా మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. కడప, అన్నమయ్య, తదితర జిల్లాల నుంచి ఎనిమిది జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమక బహుమతి గెలుపొందిన ఎద్దుల యజమానులు ఓబుల్‌రెడ్డికి రూ.50 వేలు, కడప జిల్లా రాజువారిపేటకు చెందిన హర్షవర్దన్‌రెడ్డికి ద్వితీయ బహుమతి కింద రూ.40వేలు, బాలయ్యగారిపల్లికి చెందిన విష్ణువర్దన్‌రెడ్డికి తృతీయ బహుమతి కింద రూ.30 వేలు, రాజువారిపేటకు చెందిన శ్రీకాంత్‌రెడ్డికి నాలుగో బహుమతి కింద రూ. 20 వేలు, నంద్యాల జిల్లా అలగనూరుకు చెందిన వారికి ఐదో బహుమతి కింద రూ.10 వేలు, ఉప్పరపల్లికి చెందిన రవి గౌడ్‌కు ఆరో బహుమతి కింద రూ.8 వేలు, ఏడో బహుమతి కింద రఫీ, భాస్కర్‌లకు రూ.5 వేలు, నారాయణ రెడ్డి ఎనిమిదో బహుమతికి ఎంపికైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైకోటలో

ఓబులవారిపల్లె : మండలంలోని వైకోటలో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల పండగ ఘనంగా నిర్వహించారు. శనివారం పీర్ల చావిడిలో పూల బాసికాలను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించి పీర్లను ఊరేగించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : మండలంలో మొహర్రం వేడుక ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున అగ్నిగుండంలో దిగి తమ భక్తి చాటుకున్నారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ప్రసాదాలు, చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఈడిగపల్లిలో

వీరబల్లి : మండలంలోని ఈడిగపల్లిలో శుక్రవారం పీర్ల పండగ వైభవంగా నిర్వహించారు. అగ్నిగుండం ఏర్పాటు చేసి భక్తులు గుండంలో ప్రవేశించారు. చెక్క భజన, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురప్పగారిపల్లి పంచాయతీ నుంచి తురకపల్లి పీర్లు ఈడిగపల్లి గుండం వద్దకు వచ్చి ఈడిగపల్లి పీర్లతో సలాం అందుకున్న అనంతరం ఊరంతా ఊరేగించారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుళ్లాయిరెడ్డి కుమారుడు శ్రీనివాస రెడ్డి అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుండి కూడా భక్తులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వరప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైకోట పూలబాసికాలు కడుతున్న ముజాఫర్

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

చిన్నమండెం : మండల కేంద్రంలో పీర్లను శనివారం భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. హిందూ, ముస్లింలు ఐకమత్యంతో ఉత్సవాల్లో పాల్గొన్నారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి గంధం పీరుకు పూజలు నిర్వహించారు. నిర్వాహకులు దేవనాథరెడ్డిని సత్కరించారు. రాత్రి నిర్వహించబోయే బాషిక మహోత్సవానికి కడప దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లాహుసేని హాజరుకానున్నారు. పీర్లమకాన్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఉగ్రవాదుల మూలాలపై విచారణ జరిపించాలి

రాజంపేట రూరల్: ఉగ్రవాదుల యొక్క మూలాలపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌నాయుడు కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు అబూబకర్ సిద్దికీ, మహమ్మద్ అలీలు ఆషామాషీ వ్యక్తులు కాదని వారి చరిత్రను బట్టి తెలుస్తోందన్నారు. వారు రాయచోటిలో 30 సంవత్సరాలు మకాం వేశారంటే స్థానికంగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అనుమానించాల్సి ఉందన్నారు. దేశాన్ని అస్థిరపరిచే వ్యూహంలో భాగమే ఈ స్లీపర్ సెల్స్ ఉద్దేశ్యమని అభిప్రాయపడ్డారు. రాయచోటిలో మరింతమంది స్లీపర్ సెల్స్ ఉగ్రవాదులుగా తయారుచేసుంటారనే అనుమానం ఉందన్నారు. ఉగ్రవాదులకు సహకరించిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, పట్టణ కార్యదర్శి యన్ గిరీష్, మండల ఉపాధ్యక్షులు రేణు ప్రసాద్‌రాజు, పార్లమెంట్ నాయకులు తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.